కట్టింది మేము.. కటింగ్ మీదా?

మొదటిపేజీ తరువాయి...

పుష్కలంగా నీళ్లందుతాయని, సాగు, తాగు నీటి సమస్య ఉండదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నేత దిండిగల రాజేందర్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభ సన్నాహక సమావేశాల్లో కాంగ్రెస్ మంత్రులు పోటీ పడి మరీ నెత్తి మీద నీళ్లు చల్లుకుంటున్నారని, మంత్రుల కంటే తానేం తక్కువ అన్నట్టుగా ఈ నెల 15న సీఎం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని దెప్పిపొడిచారు. సీతారామ ప్రాజెక్టు కేసీఆర్‌కు ఎంతో ఇష్టమైనదని, పదేండ్ల కృషి అని గుర్తుచేశారు. ఆ ఫలితాలు, విజయాలను తమవిగా చెప్పుకునేందుకు కాంగ్రెస్ పడుతున్న అపసోపాలు, సర్కారు పడుతున్న ఫీట్లను చూస్తుంటే నవ్వు వస్తున్నదని ఎద్దేవాచేశారు. ఖమ్మం జిల్లా కరువు బాధలను తీర్చేందుకు సీతారామ ప్రాజెక్టుకు సంకల్పం చేసింది కేసీఆర్ అని, పవిత్రమైన ప్రాజెక్టుకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని అది శరవేగంగా పూర్తికావాలని సీతారామ అని పేరుపెట్టారని గుర్తుచేశారు. ప్రాజెక్టును అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కోర్టులో కేసులు వేసినా బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నికష్టాలు అధిగమించి పట్టుదలతో పూర్తి చేసిందని చెప్పారు. 'ఈ రోజు మీకు రిబ్బన్ కటింగ్ చేసే అవకాశం వచ్చిందికదా అని ప్రాజెక్టు కట్టినట్టి కటింగ్ ఇస్తే ప్రజలు నవ్వుకుంటరు.. ఇతరుల ఘనతను తమ ఘనతగా చెప్పుకొనేటోళ్లను పరాన్నజీవులు అంటరు' అంటూ హరీశ్ ఎద్దేవాచేశారు.

30 వేల ఉద్యోగాల లెక్కనే సీతారామ కథ

'ప్రారంభించిన మూడు పంపుహౌస్ పనుల్లో పది పైసల పనైనా మీరు చేశారా? ప్రాజెక్టు కట్టాలంటే డిజైన్, భూ సేకరణ, అనుమతులకు ఏండ్లు పడుతుంది. మీరు ఏడు నెలల్లోనే పూర్తిచేశారా?' అంటూ హరీశ్ నిలదీశారు. ప్రాజెక్టు వద్దకు రోజుకో మంత్రి వెళ్తున్నారని, ఖమ్మం జిల్లాలో మంత్రులు పోటీ పడుతున్నారని, జనం వారిని చూసి నవ్వుకుంటున్నారని, సీతారామ ప్రాజెక్టు కథ కూడా 30 వేల ఉద్యోగాల తీరులానే ఉన్నదని ఎద్దేవాచేశారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేసింది. నిజాలు చెప్పే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు. నాడు కేసీఆర్ నిజాలు చెప్పారు. నిండు శాసనసభలో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్ పథకాలను కొనసాగిస్తామని చెప్పిండ్రు. ఆ ధైర్యం, సంస్కారం మాకు ఉన్నది. కాంగ్రెస్ నాయకులు మాత్రం పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరు, ఫొటో ఉన్నదని పేజీలను చింపిం చిండ్రు. మేము కట్టిన ఫ్లైఓవర్లు, ప్రాజెక్టులను ప్రారంభిస్తూ, మేము తెచ్చిన బస్సులకు జెండాలూపుతూ, మేం అమలు చేసిన పథకాలకు చెక్కులు పంచుతూ కాలం గడపుతున్నరు. ఈ ఎనిమిది నెలల్లో ఒక్కటైనా నిర్మాణాత్మక అడుగు పడిందా' అంటూ నిలదీశారు. 'కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామని అంటున్నారు.. మీ తండ్లాట, మీ తాపత్రయమే నీ నైతిక పతకానికి సంకేతం. కేసీఆర్ చేసిన పనులను తమవిగా చెప్పుకునేందుకు కాంగ్రెస్సోళ్లు పడుతున్న తపనే మా నైతిక విజయానికి నిదర్శనం' అని హరీశ్ స్పష్టంచేశారు.

మంత్రి తుమ్మల గుండెలపై చెయ్యేసుకొని చెప్పాలె

సీతారామ క్రెడిట్ కేసీఆర్‌దే అన్న మంత్రి తుమ్మల ఇప్పుడు అదేమాటను గుండెలపై చెయ్యేసుకొని చెప్పాలని హరీశ్ సూచించారు. సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ కల అని, కృష్ణా నీళ్లు రాకపోవడంతో గోదావరి నీళ్లను ఒడిసిపట్టి ఖమ్మం జిల్లాను మొత్తం రెండు పంటలతో సస్యశ్యామలం చేయాలనుకున్నారని గుర్తుచేశారు. 'రాజీవ్, ఇందిరాసాగర్లలో మీరు మూడు వేల క్యూసెక్కుల సామర్థ్యం పెడితే కేసీఆర్ 9 వేల క్యూసెక్కులకు పెంచిండ్రు. ఈ ప్రాజెక్టుల్లో మీరు కొన్ని మండలాలు, కొన్ని నియోజకవర్గాలను వదిలేసిండ్రు. కృష్ణా జలాలు ఆలస్యమై ఖరీఫ్ పంట వేసే అవకాశం ఉండకపోయేది. గోదావరి పరివాహక ప్రాంతం ఎక్కువగా ఉన్న ఖమ్మం జిల్లాకే గోదావరి జలాలు ఏనాడూ అందలేదు. ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీరందించేలా ప్రాజెక్టును కేసీఆర్ రూపొందించిండ్రు.' అని గుర్తుచేశారు. సీతారామ ప్రాజెక్ట్ మెయిన్ కెనాల్లో ఎనిమిది ప్యాకేజీల్లో ఐదు తాము పూర్తి చేశామని, మిగతా మూడింటిలో 80 శాతం పనులు పూర్తయ్యాయని, మోటర్లు, పంప్‌హౌస్‌ల నిర్మాణం బీఆర్ఎస్ హయాంలో పూర్తయిందని వివరించారు. మొత్తంగా 90 శాతం ప్రాజెక్టును తాము పూర్తి చేస్తే కాంగ్రెస్ వాళ్లు పూర్తిచేసినట్టు చెప్పుకొంటున్నారని ఎద్దేవాచేశారు. ప్రాజెక్టు పేరే సీతారామ అని, రాముడు సత్యవాక్పరిపాలకుడని, సత్యానికి, ధర్మానికి ప్రతిరూపమని, ఆయన పేరుతో కట్టిన ప్రాజెక్టుపై అబద్ధాలు చెప్తే భగవంతుడు కూడా క్షమించడని మండిపడ్డారు.

> మూడు పంపుహౌసుల్లో పది పైసల పనైనా చేశారా? డిజైన్, భూ సేకరణ, అనుమతులను మీరు ఏడు నెలల్లోనే పూర్తిచేసి ప్రాజెక్టును కట్టిండ్రా? మేం అమలు చేసిన పథకాలకు చెక్కులు పంచుతూ కాలం గడపుతున్న మీరు, ఈ ఎనిమిది నెలల్లో ఒక్క నిర్మాణాత్మక అడుగైనా వేశారా? -హరీశ్‌రావు

అనుమతులు ఆనాడే తెచ్చినం

హైడ్రాలజీకి 2023 ఏప్రిల్ 3న, ఇతర రాష్ట్రాల అనుమతులు 2023 జూలై 6న వచ్చాయని, 67.05 టీఎంసీల నీటి కేటాయింపులకు సీడబ్ల్యూసీ అనుమతులు వచ్చాయని హరీశ్‌రావు తెలిపారు. ఇందిరమ్మ సాగర్‌కు కాంగ్రెస్ 2005 నుంచి 2014 వరకు కనీసం అనుమతులు కూడా తీసుకురాలేదని, నీటి కేటాయింపులు చేయలేదని విమర్శించారు. భట్టి విక్రమార్క అప్పుడు కూడా క్యాబినెట్ హోదాలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నారని గుర్తుచేశారు. ప్రాజెక్టును తాము రైతుల అవసరాల కోసం రీడిజైన్ చేశామని చెప్పారు. గతంలోని ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ కంటే వరప్రదాయిని అని, ఆయకట్టును మూడు లక్షల ఎకరాల నుంచి 6.74 లక్షల ఎకరాలకు పెంచామని, పది పంపింగ్ స్టేషన్‌లు ఉండేవని, ఎక్కువ పంపింగ్ స్టేషన్‌లు ఉంటే ఎక్కువ సమస్యలు వస్తాయని నాలుగుకు తగ్గించామని, 27 నుంచి 67 టీఎంసీలకు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచామని చెప్పారు. బ్యారేజీలో 1.2 టీఎంసీల సామర్థ్యం ఉంటే దానిని 36 టీఎంసీలకు పెంచుకున్నామని, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్, ముదిగొండ తదితర ప్రాంతాలకు ఆయకట్టు విస్తరించామని, డోర్నకల్, మహబూబాబాద్‌కు కూడా విస్తరించామని వివరించారు. మూడు వేల చెరువులకు నీళ్లిచ్చే ప్రయత్నం చేశామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అన్ని అనుమతులను కేసీఆర్ తీసుకొచ్చారని, కేంద్ర జలశక్తి శాఖ మంత్రిని కలిశారని గుర్తుచేశారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ అనుమతులు కూడా తెచ్చామని చెప్పారు. గోదావరి నీళ్లు పాలేరు దాకా వస్తాయని, అక్కడ రివర్స్ పంపింగ్ చేస్తే నల్లగొండ జిల్లాకు కూడా నీళ్లు వస్తాయని, చిన్న లిఫ్ట్ పెట్టుకుంటే పాలేరు బ్యాక్ వాటర్ ద్వారా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ఆయకట్టుకు కూడా సీతారామ ప్రాజెక్టుతో గోదావరి జలాలను అందించేలా జాగ్రత్తలు తీసుకున్నామని, ఎంతో ముందుచూపుతో కేసీఆర్ సీతారామ ప్రాజెక్టును ప్రతిపాదించారని గుర్తుచేశారు. పాలేరు, వైరా, లంకసాగర్ రిజర్వాయర్లకు ఢోకా ఉండదని, 3.40 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టును స్థిరీకరరించే ప్రయత్నం చేశామని తెలిపారు.

కార్యదర్శులు అప్పులపాలు

'మీ పరిపాలన ఆగమాగమైంది.. రాష్ట్రంలో పాలన పడకేసింది.. అంతా గందరగోళంగా మారింది' అంటూ హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఎనిమిది నెలల బాబు కూడా డెంగ్యూతో చనిపోయాడని, మూడు వేల డెంగ్యూ కేసులు నమోదయ్యాయని, విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. పసికందులను కుక్కలు పీక్కుతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అసిఫాబాద్ జిల్లా గండిపేటలో కాశీనాథ్, పూజఅనే అమ్మాయి కూడా విషజ్వరంతో చనిపోయారని, వేలాది మంది విషజ్వరాలతో బాధపడుతున్నారని ఆందోళన చెందారు. సర్పంచ్‌లే కాదు పంచాయతీ సెక్రటరీలను కూడా అప్పుల పాలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అంటూ ఎద్దేవాచేశారు. దేశ చరిత్రలో కార్యదర్శులు అప్పుల పాలైన ఘనత లేదని, తన నియోజక వర్గానికి దమ్ముంటే కాంగ్రెస్ మంత్రులు వస్తే పంచాయతీల్లో నెలకొన్న దుస్థితిని చూపిస్తానని హరీశ్ సవాల్ విసిరారు.

తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

హాస్టల్‌లో ఒక్క మంత్రయినా అన్నం తిన్నడా?

గురుకులాల హాస్టళ్లలో భోజనం కలుషితం అవుతున్నదని, వంటల్లో ఎలుకలు, బల్లులు పడుతున్నాయని, చివరికి కారం మెతుకులతో అన్నం తినే పరిస్థితి వచ్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. 'ప్రభుత్వ హాస్టల్‌కు పోయి ఒక్క మంత్రయినా అన్నం తిన్నడా?.. విద్యార్థులను పరామర్శించారా?' అంటూ ప్రశ్నించారు. వైన్స్ షాపులకు టార్గెట్లు పెట్టడంపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేదని, ఇప్పటికైనా పబ్లిసిటీ స్టంట్స్ మాని గవర్నెన్స్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్మూర్‌లో ఏడుగురిని కుక్కలు కరిచాయని చెప్పారు. జ్వరం సర్వే తుతూ మంత్రంగా సాగిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులను ప్రారంభించడం తప్ప కాంగ్రెస్ సర్కార్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు.

వాటికి, సీతమ్మసాగర్‌కు తేడాఇదే

నాడు రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్‌లో జల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం లేదని, కానీ ఇప్పుడు అవకాశం కల్పించామని, 280 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి ఏర్పాట్లు చేశామని హరీశ్ చెప్పారు. 18 కిలోమీటర్ల కిన్నెరసాని అభయరణ్యంలో ప్రతిపాదనకు సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వాల్సి ఉంటే దీనిని మార్చామని తెలిపారు. 77 కిలోమీటర్ల పైప్‌లైన్లతో నిర్వహణ సమస్యలు వస్తాయని, వీటిని 8.50 కిలోమీటర్లకు తగ్గించామని చెప్పారు. వాస్తవాలు ఇలా ఉంటే కాంగ్రెస్ వాళ్లు మాత్రం తామే ప్రాజెక్టుకు కొబ్బరికాయ కొట్టినట్టు, రాత్రింబవళ్లు పనిచేయించినట్టు మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు రావడం తమకు ఎంతో సంతోషాన్నిస్తున్నదని చెప్పారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. సీతారామ ప్రాజెక్టు ప్రారంభాన్ని ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ తరపున పండుగలా నిర్వహించుకుందాని చెప్పారు. తమకు భేషజాలు లేవని, 75 కోట్లతో సీతారామ ప్రాజెక్టు ద్వారా 1.50 లక్షల ఎకరాలకు నీళ్లిస్తున్నామని చెప్తున్న డిప్యూటీ సీఎం భట్టికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని ఎద్దేవాచేశారు.

> ఇందిరమ్మ సాగర్ ప్రాజెక్టుకు 2005 నుంచి 2014 వరకు కాంగ్రెస్ కనీసం అనుమతులైనా తెచ్చిందా? నీటి కేటాయింపులు చేసిందా? భట్టి విక్రమార్క అప్పుడు కూడా క్యాబినెట్ హోదాలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నడు కదా? ఇప్పుడు వచ్చి 75 కోట్లతో సీతారామ ప్రాజెక్టు ద్వారా 1.50 లక్షల ఎకరాలకు నీళ్లిస్తున్నామంటున్న ఆయనకు నోబెల్ బహుమతి ఇవ్వచ్చు.. -హరీశ్‌రావు

లఘుచిత్ర రూపకల్పనలో గొత్తికోయ పిల్లలతో రఘుపతి

ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈఎంఆర్‌సీ సత్తా

- 'రీచింగ్ ది అన్‌రీచ్‌డ్' అనే లఘుచిత్రానికి మొదటి బహుమతి
- అటవీ ప్రాంతాల్లోని విద్యార్థుల స్థితిగతులపై డాక్యుమెంటరీ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్–కన్సార్షియం ఆఫ్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్(యూజీసీ–సీఈసీ) ఆధ్వర్యంలో 16వ అంతర్జాతీయ ప్రకృతి ఫిల్మ్ ఫెస్టివల్ కోసం నిర్వహించిన లఘుచిత్ర పోటీల్లో ఉస్మానియా యూనివర్సిటీలోని ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసర్చ్ సెంటర్(ఈఎంఆర్‌సీ) సత్తాచాటింది. ములుగు, భూపాలపల్లి జిల్లా అటవీ ప్రాంతాల్లోని గొత్తికోయ విద్యార్థుల స్థితిగతులపై ఈఎంఆర్‌సీ డైరెక్టర్ పీ రఘుపతి రూపొందించిన లఘుచిత్రం 'రీచింగ్ ది అన్‌రీచ్‌డ్' అభివృద్ధి విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మానవ హక్కుల విభాగంలోనూ సైటేషన్‌కు ఎంపికైంది. త్వరలో జరిగే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రఘుపతి ఈ అవార్డు అందుకోనున్నారు. ప్రతీ రోజూ ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో ప్రయాణించి, చిన్నారులకు విద్యతో పాటు బయటి సమాజాన్ని పరిచయం చేసేందుకు వలంటీర్లు చేస్తున్న కృషిని ఈఎంఆర్‌సీ డాక్యుమెంటరీగా మలిచింది. లఘుచిత్ర రూపకర్త రఘుపతిని ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి వీసీ దానకిశోర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, యూజీసీ డీన్ ప్రొఫెసర్ జీ మల్లేశం తదితరులు అభినందించారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia. ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

PUB/0805

నోటిఫికేషన్ 02/2024

దిగువ తెలిపిన విధంగా SSE కేటగిరీ కొరకు సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వేలో గతి శక్తి యూనిట్ కొరకు నెలవారీ పారితోషికం ప్రాతిపదికన రీ–ఎంగేజ్‌మెంట్ కొరకు రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

క్ర. సం.	డిపార్ట్‌మెంట్	కేటగిరి	అవసరమైన రీ–నోటిఫికేషన్ ఖాళీల సంఖ్య	మొత్తం
1.	ఇంజినీరింగ్	SSE/డ్రాయింగ్	01	03
		SSE/వర్క్స్	01	
		SSE/బ్రిడ్జ్	01	
2.	Elect.	OS	01	05
		SSE/డ్రాయింగ్	01	
		SSE/జనరల్	01	
		SSE/TRD	02	
3.	S&T	SSE/డ్రాయింగ్	02	03
		SSE/సిగ్నల్	01	
	పూర్తి మొత్తం			11

www.scr.indianrailways.gov.in> About us> Divisions> Secunderabad>Personnel> Notifications and Results దరఖాస్తులు https://cutt.ly/GSUSCSCR ద్వారా దాఖలు చేయవచ్చును.

దరఖాస్తుల దాఖలుకు చివరి తేది: 23.08.2024

ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే అనుమతించబడును.

A1036 సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్, సికింద్రాబాద్

మాకెందుకు 'సీతారామ' నీళ్లియ్యరు!

- చెరువులు నింపకుంటే ఉద్యమాన్ని వీడం
- జూలూరుపాడు మండల రైతుల ప్రతిన
- ప్రాజెక్టు రీడిజైన్ చేసిన కాంగ్రెస్ సర్కార్
- నీటిని మళ్లించడంతో తీవ్ర నష్టం
- భూములిచ్చిన రైతుల పోరు తీవ్రరూపం

జూలూరుపాడు, ఆగస్టు 12: ప్రాజెక్టు కోసం మా భూములు కోల్పోయాం.. మా కండ్ల ముందు నుంచి నీళ్లు వెళ్తున్నాయి.. మా చెరువులు నింపకుండా ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు.. కాంగ్రెస్ సర్కారు రీడిజైన్‌తో మాకు తీరని అన్యాయం చేసింది.. మాకు నీళ్లియ్యకుండా తరలిస్తే చూస్తూ ఊరుకోం.. అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల రైతాంగం ప్రతినబూనింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం రీడిజైన్ చేసింది. జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ సమీపం నుంచి ఏన్కూరులో ఉన్న సాగర్ కాల్వ వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర లింక్ కెనాల్‌కు నిధులు కేటాయించి ఆగమేఘాల మీద పనులను పూర్తిచేశారు. ఈ నెల 15న సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. తమ మండలంలోని చెరువులన్నింటినీ నింపకుండా నీటిని మళ్లించి తరలించుకు వెళ్తున్నారని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏన్నో ఏళ్లుగా సాగునీటి కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్న తమ ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అఖిలపక్షం ఆధ్వర్యంలో గత కొన్నిరోజులుగా రైతులు ఆందోళన కొనసాగిస్తున్నారు. గత కొంతకాలంగా వినతిపత్రాల అందజేత, జలదీక్ష, ధర్నాలతో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంత రైతుల భూములను ఎండబెడుతూ సొంత ప్రయోజనాల కోసం నీటిని తరలించుకుపోతున్న కాంగ్రెస్ మంత్రుల నిర్ణయాలను ఎండగడతామని రైతులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

జూలూరుపాడు రైతుల గోడు ఇది!

జూలూరుపాడు మండల పరిధిలోని నల్లబండబోడు గ్రామ సమీపం నుంచి రామచంద్రాపురం, గుండెపుడి, ఓంటిగుడిసె, జూలూరుపాడు, వినోభానగర్, పాపకొల్లు, పుల్లుడు తండా మీదుగా పాపకొల్లు అటవీ ప్రాంతమైన పోలవరం ప్రాజెక్టు సరిహద్దు వరకు సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇక్కడ నుంచి ఎత్తయిన గుట్టకు సొరంగమార్గం వేసి నీటిని కారేపల్లి మండలం ద్వారా వైరా, పాలేరు పరిధిలోని చెరువులకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పట్లో డిజైన్ రూపొందించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రీడిజైన్ చేసి వినోభానగర్ నుంచే నీటిని మళ్లించడంతో జూలూరుపాడు మండలంలోని అన్ని చెరువులను నింపేందుకు వీలులేకుండా పోయింది. దీంతో ఈ ప్రాంత రైతులు ఆందోళన చేస్తున్నారు.

సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

సాగునీరొస్తుందని భూములిచ్చాం

జూలూరుపాడు మండలంలోని అన్ని చెరువులకు నీటిని అందిస్తామని గ్రామసభల్లో అధికారులు హామీ ఇచ్చారు. మా ప్రాంతానికి నీరివ్వకుండా నీటిని తరలించుకుపోతుంటే చూస్తూ ఊరుకోం. మాకు సాగునీటిని ఇవ్వకుంటే మా భూములు మాకివ్వాలి.

- పాన్నెకంటి వెంకటయ్య, గుండెపుడి గ్రామం, జూలూరుపాడు మండలం

పాత డిజైన్ ప్రకారమే నీరివ్వాలి

బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన డిజైన్ ప్రకారమే సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయాలి. భూములను కోల్పోయిన మాకే మొదట నీరిచ్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు తరలించుకుపోవాలి. ఈ ప్రాంతానికి సాగునీరందించేదాకా రైతులందరం ఆందోళన చేస్తూనే ఉంటాం.

- యల్లంకి కార్తికేయ, గుండెపుడి గ్రామం, జూలూరుపాడు మండలం

డీటీవో గౌస్‌పాషా అరెస్ట్

మహబూబాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): అక్రమాలకు పాల్పడిన మహబూబాబాద్ డీటీవో మహ్మద్ గౌస్‌పాషాతో పాటు డ్రైవర్ ఎలమందల సుబ్బారావు,ప్రైవేట్ వ్యక్తి రాంగోపాల్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. డీటీవో గౌస్‌పాషాపై వాహనదారులు ఏసీబీ అధికారులకు లేఖ రాశారు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. ఈ ఏడాది మే 28న మహబూబాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ సుబ్బారావు వద్ద లెక్కల్లో చూపని 61,600 నగదుతోపాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో గౌస్‌పాషా పనిచేసినపుడు కుమారుడు మహ్మద్ ఆరీఫుద్దీన్, మేనల్లుడు మహ్మ ద్ మునీర్‌తో కలిసి రూ.2.97లక్షలు లంచం వసూలు చేసినట్టు విచారణలో తేలింది. ఇవి కాకుండా మరో రూ.38 వేలు కారు డ్రైవర్ సుబ్బారావు ద్వారా గ్రానైట్, ఏజెంట్లు, వాహనదారుల నుంచి వసూలు చేసి వివిధ బ్యాంకు ఖాతాలకు మళ్లించి డిపాజిట్ చేశారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏ1గా డీటీవో మహ్మద్ గౌస్‌పాషా, ఏ2గా ఎలమందల సుబ్బారావు, ఏ3గా డీటీవో కుమారుడు అరిఫుద్దీన్, ఏ4గా గౌస్‌పాషా మేనల్లుడు మహ్మద్ మునీర్, ఏ5గా తణుకు రాంగోపాల్‌పై కేసు నమోదు చేశారు. ఈ నెల 11న గౌస్‌పాషా, సుబ్బారావు, రాంగోపాల్‌లను అరెస్ట్ చేసి సోమవారం వరంగల్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరుచగా, జడ్జి వారిని రిమాండ్‌కు ఆదేశించడంతో పోలీసులు జైలుకు తరలించారు.

డీటీవో మహ్మద్ గౌస్ పాషా(మధ్యలో), డ్రైవర్ సుబ్బారావు, ప్రైవేట్ వ్యక్తి రాంగోపాల్

ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఏఈ

- రూ.6 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

సుబేదారి, ఆగస్టు 12: ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఏఈగా పనిచేస్తున్న గుగులోత్ గోపాల్ లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి సబ్‌డివిజన్‌లో నీటిపారుదల శాఖ ఏఈగా పనిచేస్తున్న గుగులోత్ గోపాల్ పాలకుర్తి మండలం గుడికుంట తండా స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ బానోత్ కాంతి భర్త యాకూబ్ నాయక్ గ్రామపంచాయతీలో చేపట్టిన పనుల బిల్లులు మంజూరు చేయాలని గోపాల్‌ను సంప్రదించాడు. రూ.6 వేల లంచం ఇస్తే బిల్లులు మంజూరు చేస్తానని చెప్పడంతో యాకూబ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ప్లాన్ ప్రకారం.. సోమవారం హనుమకొండ నక్కలగుట్ట ఎస్‌బీఐ సమీపంలో యాకూబ్ నుంచి గోపాల్ రూ.6 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఏసీబీకి పట్టుబడిన ఏఈ గోపాల్